17

# నమ్మకం వెర్సెస్ సైన్స్

వైద్యం సేవా రంగం కాదు, వ్యాపారం అయింది. మరీ ఇంతా అని నేననుకున్నది ఢిల్లీకి తూర్పు వైపున ఉన్న నోయిడా వెళ్ళాక. నోయిడా బ్రాంచ్‌లో జాయినయిన కొన్నాళ్ళకే, ఏదో నొప్పి కడుపులో రావడం మొదలయింది. అజీర్తి అన్నారు. టైమింగ్స్ పెట్టుకున్నాను. గ్యాస్ అన్నారు. ఎంటాసిడ్‌లు, మిల్కాఫ్ మెగ్నీషియా లాంటివి ఓ కాయితం మీద రాయడానికి మూడొందలు, మూడు గంటలు పడిగాపు. తగ్గలేదు. ఎపెండిసైటిస్ కావచ్చుని, మూడుచోట్ల మూడు ఎక్స్‌రేలు తీయించారు. అదికాదు అని ఏడేసి వందలు పుచ్చుకున్నాక చెప్పారు. కొలీగ్ తివారీ, అట్టా మార్కెట్ నుంచి హోమియో మందులు తెప్పించినా ఫలితం శూన్యం. చాందినీ చౌక్ నుంచి హకీంగారి హోంమేడ్ చూర్ణాలు. నో యూజ్. ఆయుర్వేదం నిరుపయోగం అయింది. ఘరేలు – నుక్సే (ఇంటి చిట్కాలన్నమాట) కూడా ప్రయోజనం ఇవ్వలేదు.

పెపంచంలో పాపపున్నాలు లేవు. నాబ నష్టాలే ఉన్నాయి... అని అనిపించారు రావిశాస్త్రిగారు రత్తాలు ద్వారా. అది అక్షరాలా నిజం. డాక్టర్ల ఫీజులు అలా ఉన్నాయి. ఈ విధంగా ఆర్నెల్ల నుంచి నొప్పి, నేనూ కలిసి ఉంటున్నాం. "కిడ్నీలోనో మరెక్కడో రాళ్ళు కూడా లేవు కాబట్టి, మనం మా ఊరి వైద్యం చేయించడానికి మహారాజ్ దగ్గరికెళ్తున్నాం" అన్నాడు తివారి.

"ఎవరా మహారాజు? ఏమా కథ?" అడిగాను.

"మా ఊళ్ళో రాంనారాయణ్ మహారాజ్ ఉన్నాడు. మహా మహా రోగాలే తగ్గించే శక్తి ఆయనకి ఉంది. మంచి సలహాలు, ఉపాయాలు ఇస్తాడు. ఆయన గది ఎప్పుడూ కిటకిటలాడి పోతూంటుంది. ఈ శనివారం పొద్దున్నే మా ఇంటి కొచ్చేస్తే, నా కార్లో మా ఊరు వెళ్దాం. ఇంక నువ్వేం మాట్లాడకు."

ఉత్తరప్రదేశ్, బీహారుల్లోని పల్లెటూళ్ళల్లో ఇంకా ఇలాంటి వైద్యాల, మీద నమ్మకాలు ఉన్నవాళ్ళు ఎక్కువ. వీళ్ళకి నమ్మకం ముఖ్యం. దానిముందు హేతువాదం నిలవలేదు. అనుభవపూర్వకంగా ఆ సంగతి తెలుసుకున్నాను.

శనివారం పొద్దున్నే తివారి ఇంటికెళ్ళాను. అక్కడి నుంచి ఇద్దరం ఢిల్లీకి దగ్గర్లో ఉన్న ఓ పల్లెటూరు కెళ్ళాం. అది టిపికల్ యూపీలో ఉండే పల్లెటూరు లాగానే ఉంది. ఊళ్ళోకి వెళ్లాక, నాలుగు వీధులు నాలుగు మలుపులు అయ్యాకా, ఓ గుమ్మం ముందర కారు ఆపాడు.

ఇద్దరం ఇంటి ముందున్న బోర్డుని ఓసారి చదివి లోపలికెళ్ళాం. లోపల పెద్ద పెరడు. నాలుగువైపులా పోర్షన్లు, మధ్యలో ఓ జామచెట్టు, దానిమ్మచెట్టు, బంతిమొక్కలూ ఉన్నాయి. ఓ బోరు పంపు, మూసేసిన బావి, బట్టలుతుక్కునే బండరాయి, నీళ్ళు నిండిన రెండు తొట్టెలు, తాళ్ళమీద వేళ్ళాడుతున్న బట్టలు. అటు ఇటూ తిరుగుతున్న కోళ్ళు, పిల్లలు, రెక్కలాడిస్తున్న పావురాళ్ళు, కట్టేసిన ఓ నల్ల కుక్క.

అన్నీ చూస్తూ రాంనారాయణ్ మహారాజ్ అన్న బోర్డున్న వైపు వెళ్ళాం. అదో పెద్ద గది. కిటకిటలాడుతున్న జనం. కొంతమంది కింద కూచున్నారు. కొంతమంది ఓ వారగా వేసిన ఎర్ర ప్లాస్టిక్ కుర్చీల్లో కూచుని ఉన్నారు. ఓ చివరగా ఓ చిన్న పరుపుంది. ఆ పరుపు మీద ఎవరూ లేరు. పరుపుకి నాలుగు వైపులా ఏవేవో చిన్నా చితకా డబ్బాలు, సీసాలు, పుస్తకాలు, సంచీలు. ఓ వైపు గోడకి దేవుడి పటాలు. వాటి ముందు వెలుగుతున్న అగరొత్తులు.

ఏ డాక్టరు కోసం అయినా ఇంతమంది వెయిట్ చేస్తూంటారో లేదో అనుమానమే.

"చూశావా, ఎంతమందో!" అన్నట్టు సైగ చేశాడు తివారి. జనంలో ఆడవాళ్ళే ఎక్కువ మంది ఉన్నారు. మగాళ్ళు కొంతమంది మాత్రమే ఉన్నారు. అందరి

మొహాల్లోనూ ఏదో బాధ, విషాదం. వాళ్ళని చూడగానే నా నొప్పి గుర్తొచ్చి, నా మొహం కూడా వాళ్ళ మొహాల్లాగే అయింది. ఇద్దరం కుర్చీల్లో కూచున్నాం.

కాస్సేపయ్యాక, రామ రామ హరే హరే రామ అంటూ కాషాయ రంగు లాల్చీ, పంచె వేసుకున్న ఓ తెల్లటి నలభై ఏళ్ళు దాటిన మనిషి వచ్చి, పరుపుమీద కూచుని కళ్ళు మూసుకున్నాడు.

కుడి పైట వేసుకున్న ఓ ఎర్రపూల చీర స్త్రీ, నెత్తిమీద కొంగుని సవరించుకుంటూ ఆయన ముందు కూచుంది.

మహారాజ్ కళ్ళు తెరిచాడు. పూర్తిగా కాదు. అర్ధనిమీలిత నేత్రాలతోనే సైగ చేశాడు చెప్పమన్నట్లుగా.

"మహరాజ్! నా కొడుకుకి ఎప్పుడూ ఏదో సుస్తి. నీరసం. ఏ పనీ చెయ్యడు. మీరే ఏదయినా చెయ్యాలి..."

తల ఊపి, "ఎప్పుడు పుట్టాడు? ఏ రోజున, అన్ని వివరాలు ఇయ్యి."

ఆమెకు ముందే తెలుసేమో, ఇలాంటి ప్రశ్నలుంటాయని. ఆయన అడిగీ అడగంగానే తన బట్ట పరుసులోంచి ఓ కాయితం ఇచ్చింది.

కనుబొమలు పైకెత్తి, ఓసారి ఆ కాయితాన్ని చూశాడు. వెంటనే కుడివైపుకి, తొంభై డిగ్రీల కోణంలో తిరిగి, ఓ పెద్ద పుస్తకాన్ని, ఎడంవైపుకి తిరిగి, ఓ పలకా బలపాన్ని తీసి ఏవేవో గళ్ళు గీసి, అంకెలు వేశాడు. కళ్ళు పైకెత్తి చాలా సేపు ఆలోచించాడు. కళ్ళు చిన్నగా చేసి ఆమెను చూశాడు.

"దోషం... మంగల్ దోషం.. శని ప్రభావం. చాలా ఉంది... అందుకని ఏం చేయాలంటే, జపాలు చేయాలి. ఏం చేయాలి?"

"జపాలు" అని అంది.

"నల్ల నువ్వులు, నల్లబట్ట, నూనె గుడిలో శనిదేవతకిచ్చి పూజ చెయ్యాలి. ఏం చెయ్యాలి?"

ప్రశ్న వేశాడు కానీ, ఆమె జవాబు కోసం చూడలేదు.

ఓ రాగి పళ్ళెం తీశాడు, వెనకనుంచి ఓ డబ్బాలోని ఎర్ర తాళ్ళని ఆ పళ్ళెంలో వేసాడు. చూపుడు వేలుతో వాటిని రెండుసార్లు అటూ ఇటూ అని ఓ ఎర్ర తాడుని తీశాడు. ఆమెవైపు చూశాడు.

"ఇది చాలా మహిమ ఉన్నది. రేప్పొద్దున్న స్నానం చేశాక, దేవుడి ముందర కూచుని, కుడి చేతికి కట్టుకోవాలి. ఓ నెల రోజులు, శనికి మంగల్‌కి జపాలు చేయాలి. తప్పకుండా ఫలితం కనిపిస్తుంది. ఓ నెల తర్వాత రా..."

ఆమె లేచింది. జాకెట్టుకున్న జేబులోంచి ఓ నలిగిపోయిన పది కాయితం తీసి ఇచ్చింది. ఆయన పుచ్చుకోలేదు. ఇంకో పది తీసింది. అక్కడున్న గల్లా పెట్టెలో వెయ్యమన్నట్లు సైగ చేశాడు.

ఆమె వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఓ ఎర్రపూల పంజాబి డ్రెస్‌లో ఉన్న ఓ లావుపాటి ఆమె వచ్చి కూచుంది. ఆమె పక్కన ఓ సన్నటి మనిషి, వదులుగా ఉన్న పైజామా, లక్నో కుర్తాతో కూచున్నాడు.

సద్దుకుని కూచున్నాక, ఆమె ఏడవడం మొదలెట్టింది. "సరిగ్గా కిందటి నెల వచ్చాను. పదకొండు రూపాయలు ఇచ్చాను. ఇంకో పదకొండు రూపాయలిచ్చి ఓ మంత్రం వేసిన తాడు తీసుకున్నాను. ఆ తాడు మా పితాజీ చేతికి కడ్తే, ఆయన బతుకుతాడని అన్నారు. జపాలు చెయ్యమంటే చేశాం. రామాయణ పాఠ్ చేశా, జొరం తగ్గలేదు. సఫదర్ జంగ్ ఆస్పతాల్ తీసుకెళ్ళాం. కానీ బతకలేదు..." అంటూ మళ్ళా ఏడవడం మొదలెట్టింది.

ఆయన కళ్ళు ఓసారి పెద్దగా చేశాడు. తల అడ్డంగా ఊపాడు. "అన్ని జపాలు చేశాక అలా ఎందుకు జరిగింది? ఆ... మీరు మృత్యుంజయ జపాలు చేశారా?"

"లేదు... ఎలా చేస్తాం? ఈ లోపలే ఆయన పోయాడు కదా!"

అరచేత్తో ముందున్న బల్లమీద కొట్టాడు.

"అదీ సంగతి... అందుకే అలా జరిగింది. ఆ జపం కూడా పూర్తయి ఉంటే మీ పితాజీ బతికేవారు. జపాలు, హోమాలు, పూజలు పూర్తి కాకుండా, ఫలితాలు రమ్మంటే ఎలా వస్తాయి? తప్పు చేశారు ఏం చేశారు?"

"తప్పు..." అంది.

"అం... చిన్న తప్పు కూడా కాదు. పేద్ద తప్పు. ఆ మృత్యుంజయుడు సంతోషడి ఉంటే, మీ పితాజీ మీకు మిగిలేవారు. ఇప్పుడు అనుకుని ఏం లాభం?..." అంటూ పెదవి విరిచి, తన తప్పేమీ లేనట్లు, తప్పంతా మీదే అన్నట్లు చూశాడు.

ఇంకో ముసలామె ఓ పదిహేను, పదహారేళ్ళ పిల్లాడిని తీసుకొచ్చి కూచుంది.

"ఈ పిల్లాడు రాత్రిళ్ళు నిద్రపోవడం లేదు. ఏదో భయం అంటాడు. మధ్య మధ్యలో అరుస్తూంటాడు. మీరే ఏదయినా చేయాలి?"

"చింత వొద్దు తల్లీ! పిల్లాడి తల దిండు కింద ఓ చాకు పెట్టండి. పడుకునే ముందు హనుమాన్ చాలీసా చదవాలి. ఓ పదిహేను రోజులు అయ్యాక మంచి కలలు వస్తాయి. హనుమాన్‌జీ కూడా ఓ రోజున కల్లో వస్తాడు. ఆ తర్వాత ఓ కిలో పేడా పర్‌షాద్ తీసుకురా..."

ఆమె ఓ పదిరూపాయలిచ్చింది. ఆయన ఓ తాడు ఇచ్చాడు. పదకొండు రూపాయలు డబ్బాలో వేశాక వెళ్ళిపోయింది, పిల్లాడిని తీసుకుని.

ఈ విధంగా ఓ పదిమంది అయ్యాక నా వంతు వచ్చింది. నేను కుర్చీలోంచి లేవబోతూంటే మహరాజ్ ఫోన్ మోగింది. నేను కూచున్నాను.

"హల్లో.. మై రామ్ నారాయణ్ మహరాజ్... నమష్కార్.. నమష్కార్... ఎలా గుర్తొచ్చాను?... చెప్పండి... ఓ .... ఓ... హాం జీ... ఠీక్ హై... ఠీక్ హై... సరిగ్గా రేపు ఉదయం ఆరుగంటలకే వచ్చేస్తాను. మీ నౌకర్ని పంపిస్తే ఉద్యాపనకి ఏం కావాలో రాసిస్తాను... బరాబర్.. జీ... హంజీ.. హంజీ నమష్కార్..." అంటూ ఫోన్ పెట్టేశాడు.

నేను వెళ్ళి కూచుని, నా బాధ చెప్పాను.

నా చొక్కా ఎత్తి కడుపు మీద కొట్టాడు. నాలిక చూశాడు. అరచేతులు చూశాడు. గోళ్ళు చూశాడు. కళ్ళు చూశాడు.

"నేను చెప్పినట్లు చేస్తే ఒక్క నెలలో తగ్గిపోతుంది. రెండు ఏకాదశిలు ఉపవాసం ఉండాలి. ద్వాదశి రోజున పొద్దున్నే భోగ్ ఛడాయించాలి. ఆ తర్వాత గణేష్ పూజ

చేయాలి. ఛండీ మాతా జపం చేయాలి... ఆ తర్వాత ఏం చేయాలో చెప్తాను" అంటూ ఓ ఎర్ర తాడిచ్చాడు. దేవుడి ఎదురుగా కూచుని కుడి చేతికి కట్టుకోమన్నాడు.

ఆ తర్వాత అటూ ఇటూ ఉన్న డబ్బాల మూతలు తీసి దేనికోసమో వెతుకుతున్నాడు. కావల్సిన డబ్బా దొరికాక, దాన్ని తన ముందున్న డెస్క్ మీద పెట్టి మూత తీశాడు. చూపుడు వేలుతో కెలికి, కెలికి, ఓ పగడం తీశాడు.

"దీన్ని వెండిలో వేయించి, ఉంగరం చేయించండి. దానిని, పూజచేసి కుడిచేతి వేలికి పెట్టుకోండి. మళ్ళా నెల రోజులయ్యాక రండి."

తాడుకి పదకొండు, సలహాలకి మరో పదకొండు, పగడానికి నూటయాభై తీసుకున్నాడు. కాదు... డబ్బాలో వేయమన్నాడు.

వారం రోజుల క్రితం మధు షిరివాస్తవ్‌కి, కన్సల్టేషన్‌తో సహా మూడువంద లిచ్చాను. అందులోనే మందులు కొనాలన్న నియమం ఉంది. కాబట్టి మరో వంద ఇచ్చి వాళ్ళ ఫార్మసీలో మందులు కొన్నా ఫలితం కనపళ్ళేదు. వాటితో పోలిస్తే ఈ పండిట్‌జీ చచ్చేంత చీప్.

ఓ వారం రోజులు గడిచాయి. నొప్పి తగ్గలేదు.

మా బావమరిది అక్కడెక్కడో, హైదరాబాద్‌లోనే ఓ ఫ్లాట్ తీసుకున్నాడట. ఇల్లు పూర్తికాకుండానే గృహప్రవేశం చేసుకుంటున్నారట. నా భార్య సుప్రియ ఒక్కతే ఆడపిల్ల కాబట్టి మరీ మరీ రమ్మనమని ఫోన్లో చెప్పాడు. ఏ రాజధానిలోనూ రిజర్వేషన్ దొరకలేదు. తిరుపతి వెళ్ళే సంపర్క క్రాంతిలో దొరికింది దానిలోనే వెళ్ళాం.

గృహప్రవేశం అయిన మర్నాడే కడుపునొప్పి వచ్చింది. దగ్గర్లోనే ఉన్న మల్టీ స్పెషాలిటీ హాస్పటల్లో, ఓ గ్యాస్ట్రో ఎంటరాజిస్ట్‌కి చూపించాం.

ఆయనకి, ఎక్స్-రేలతో సహా అన్నీ వివరంగా చెప్పాను. అల్సర్ అని అన్నాడు. ఎండోస్కోపీ ద్వారా, అధునాతన పద్ధతిలో ఆపరేషన్ అయిపోయింది.

వారం రోజులు విశ్రాంతి తీసుకుని ఢిల్లీ వచ్చాను. రెండు రోజులు సెలవులొచ్చాయి. శని, ఆదివారాలు కాబట్టి – సోమవారం ఆఫీసుకెళ్ళాను.

మధ్యలో సిగరెట్టు తాగడానికి బయటికొచ్చినప్పుడు తివారి కనిపించాడు.

“షిరికాంత్ జీ! ఎలా ఎన్నారు? నొప్పి ఏఁవయినా తగ్గిందా?”

అప్పటికిగాని గుర్తు రాలేదు, మహరాజ్ చెప్పిన ఏకాదశి ఉపాషాలు, ద్వాదశి భోగ్ సంగతి. అవేవీ చెయ్యలేదు. కానీ, ఎలా చెప్పాలో తెలీలేదు.

“నొప్పి ఏమీ లేదు, తగ్గిపోయింది”.

“చూశావా! మహరాజ్ జీ మహాత్మ్యం. ఇప్పటికైనా నమ్మకం కుదిరిందా?”

“ఉపాషాలు అవీ ఏమీ చెయ్యలేదు...”

“తగ్గిపోయాక చెయ్యాల్సిన పనిలేదు కదా.. ఇంక చెయ్యక్కర్లేదు... ఇంకా నెల కాకుండానే తగ్గిపోయింది.”

“నువ్వు పూర్తిగా వినటంలేదు. హైదరాబాద్ వెళ్ళాక తెలిసింది అల్సర్ అని. అక్కడ ఆపరేషన్ చేశారు...”

“అదే కదా, మహాత్మ్యం అంటే.. ఇన్ని రోజులు మనకెందుకు తెలీలేదు. అది అల్సర్ అని! అదీ చమత్కార్. అందుకే మహరాజ్ దగ్గరికి అందరూ వస్తారు. తగ్గిపోతుంది అన్నాడు. అలాగే తగ్గిపోయింది. నెల రోజుల లోపల అంటే నెల రోజులు. సరిగ్గా అలాగే జరిగింది. అసలు ఇంకా ముందే... మహత్మ్యం”

ఇక్కడ తివారి నమ్మకం సైన్సుని ఓ పక్కన పడేసింది.

*పత్రిక మాసపత్రిక, ఏప్రిల్ 2008*